క్లుప్తంగా

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు అల్లాదుర్గం కాంప్లెక్స్ హెచ్ఎం ధనుంజయ్య చెప్పారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక, జెడ్పీ, ప్రాథమికోన్నత పాఠశాలలకు పుస్తకాలు హెచ్ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రాథమిక పాఠశాలలకు 50 శాతం, జెడ్పీ పాఠశాలలకు 90 శాతం పుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు అల్లాదుర్గం బాలుర జెడ్పీ పాఠశాలకు వచ్చి పుస్తకాలు తీసుకెళ్లాలని కోరారు.

‘బీసీలను మభ్య పెట్టడానికే రుణాలు’



మీ సేవ కేంద్రాల వద్ద ప్రజలు

నిజాంపేట(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మభ్య పెట్టడం కోసం బీసీ రుణాలు వర్తింపజేస్తానని అనడం సరికాదని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహంకాళి నరేశ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రం నిజాంపేటలో బీసీ రుణాల విషయంలో ఆకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయానికి ప్రజలు మీసేవ సెంటర్ల వద్ద కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం మూడు, నాలుగు రోజులకు పడిగాపులు కాస్తున్నారు. దీనికి ముందస్తు చర్యలుగా అదనపు సేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అప్లికేషన్ గడువు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. బీసీల్లో అన్ని కులాలకు ఈ పథకం వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రెడ్డి నరేష్, నాగరాజు, యాదగిరి, నవీన్, మహిపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పుస్తకాల తరలింపు



పుస్తకాలు మోస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాలలు తెరచుకోవడంతో విద్యార్థులకు అవసరమైన అభ్యాసన పుస్తకాలు పాఠశాలలకు తరలింపు వేగవంతమైంది. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులే పుస్తకాలను మోస్తు ఆటోల్లో కార్లలో లోడ్ చేస్తు కన్పించారు. మరి కొందరు ఉపాధ్యాయులే పుస్తకాలను మోశారు. మారిన పరిస్థితిల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అటెండర్ల పని చేస్తున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న పురోహితుడు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని రేణుకా ఎల్లమ్మదేవి ఆలయంలో మంగళవారం గౌడసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పురోహితులు రాజేశ్వరశర్మ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం గౌడసంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణగౌడ్, యాదాగౌడ్, సత్యనారాయణగౌడ్, రాజుగౌడ్, బాలాగౌడ్, రమేశ్‌గౌడ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న దృశ్యం

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లి పోచమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం మూలమంత్రహవనం, పంచ సూక్తములతో యంత్రం, విగ్రహానికి అభిషేకం చేశారు. చండీ హోమం నిర్వహించారు. నాచగిరి క్షేత్రం మధుసూదనానంద సరస్వతిస్వామి ఈ ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

పొదల మధ్య పశువుల ఆస్పత్రి



అల్లాదుర్గం పశువైద్య కేంద్రం వద్ద దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు

అల్లాదుర్గం(మెదక్): స్వచ్ఛభారత్, వర్షాకాలంతో పరిశుభ్రత పాటించాలని అధికారులు ఎన్నో కార్యక్రమాలు, సమావేశాలు ఏర్పాటు చేసి చెబుతుంటారు. ఇన్ని చెబుతున్న అధికారులుండే కార్యాలయాల చుట్టు మాత్రం పిచ్చి మొక్కలు పొదలుగా మారి అపరిశుభ్రంగా మారాయి. పొదలతో విషపు పురుగులు సంచరిస్తాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. పశువుల ఆస్పత్రి చుట్టు పొదలు వెలిశాయి. పశువుల చికిత్స అందించే ప్రాంతం కూడా పొదలతో నిండిపోయింది. ఇది అల్లాదుర్గం పశువైద్య కేంద్రం దుస్థితి.

- అల్లాదుర్గం పశువైద్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తుంది. డాక్టర్ లేక సరైన వైద్యం పశువులకు అందడం లేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు పశువులకు చికిత్స అందించే ప్రాంతంలో పొదలతో నిండిపోయింది. పశువులను కట్టెసి ఇంజక్షన్ చేసే ప్రాంతమంతా పిచ్చి మొక్కలున్నారు. ఆస్పత్రిలో ఉంటే అసిస్టెంట్ డాక్టర్ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పొదలు భారీగా పెరిగే అవకాశం ఉందని దీంతో పాములు సంచరిస్తున్నాయన్నారు. ఇప్పటికైన సిబ్బంది చర్యలు తీసుకొని పొదలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

మట్టి అక్రమ రవాణా అడ్డగింత



మనోహరాబాద్ పోలీసులు పట్టుకున్న టిప్పర్

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకున్నారు. మంగళవారం వేకువజామున మండలంలోని జీడిపల్లి గ్రామం మీదుగా అక్రమ మట్టి రవాణాను ఓ పరిశ్రమకు తరలిస్తున్నారని కొంత మంది గ్రామస్తులు అడ్డుకున్నారు. అంతే కాకుండా వీఆర్ఏను కూడా ఆపేశారు. దీంతో వీఆర్ఏలకు మట్టిని తరలిస్తున్న బీఆర్ఎస్ నాయకులకు మధ్య గొడవ జరిగింది. అనంతరం పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్ఐ సందీప్‌రెడ్డిని వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని, గ్రామంలో కొంత మంది బీఆర్ఎస్ నాయకులు వర్గాలుగా విడిపోయి అక్రమ మట్టి రవాణాకు గొడవలు పడుతున్నారని చెప్పారు.

బయన్న చెరువులో మట్టి తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలోని బయన్న చెరువులో నుంచి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెండు రోజుల నుంచి రాత్రి వేళ జేసీబీలతో తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా జిన్నారం మండలంలోని ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అన్నారు. ఈ విషయమై.. ఆర్ఐ కిషన్ వివరణ కోరగా బయన్న చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయం మా దృష్టికి రాలేదని, పరిశీలించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వాగు కబ్జాను అడ్డుకోవాలి

ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ రాజేందర్‌రావు



వాగును కబ్జా చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): వాగును కబ్జా చేయడం చట్టరీత్యా నేరం, వెంటనే అరికట్టాలని ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ రాజేందర్‌రావు ఆదేశించారు. మంగళవారం మాసాయిపేట మండలం హకీంపేట గ్రామ పంచాయతీ శివారులో గంగమ్మ మందిరం వద్ద రామంతపూర్ వాగును ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చేసిన కబ్జాను ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఈఈ రాజేందర్‌రావు, ఏఈ కవిత, మాసాయిపేట తహసీల్దార్ ధన్‌సింగ్, సర్వేయర్ నర్సింలు పరిశీలించారు. వాగులో నింపిన బండ రాళ్లను, మట్టిని తొలగించాలని ఆదేశించారు. వెంటనే వెంచర్ యజమాని సంపత్‌రావు జేసీబీతో తొలగింపు పనులను ప్రారంభించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపేట గ్రామ నాయకులు కుంట పరమేశ్వర రెడ్డి కుమార్తె వినీతరెడ్డి జ్ఞాపకార్థం బాలవికాస్ మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎంపీపీ జంగం శ్రీనివాస్ ప్రారంభించారు. పరమేశ్వర్‌రెడ్డి సొంత డబ్బులు రూ.2 లక్షలు వెచ్చించి గ్రామస్థులకు మంచినీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంపై ఎంపీపీ అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనంతరావు, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, రమేశ్, సంగమేశ్వర్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

‘భోజన పథకాన్ని ఎవరికీ అప్పగించొద్దు’



జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దని జిల్లా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి మనోహరాబాద్ మండల కేంద్రం జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కేంద్రీకృత వంటశాలల పేరుతో మధ్యాహ్న భోజనాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. దీంతో భోజన కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం భోజన కార్మికులను తొలగించకుండా వారికి నెలకు వేతనం రూ. 3 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భోజన కార్మికులు వెంకటలక్ష్మి, ప్రమీలా, రాజమణి, ఎల్లమ్మ, లక్ష్మి, కల్పన, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించాలి**



మెదక్‌జోన్: బీజేపీని అధికారంలోకి తీసుకు రావటానికి ప్రతీ కార్యకర్త క్రియాశీలక పాత్ర పోషించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, న్యాయవ్యాది ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన మెదక్ అసెంబ్లీస్థాయి సీనియర్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు జనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ ఎక్కల్‌దేవి మధుసూదన్, బైండ్ల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు నవత్ రాజేంద్ర ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మురళీయాదవ్**

నర్సాపూర్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. బుధవారం పలువురిని పార్టీ రాష్ట్ర కమిటీ పదవుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా మురళీయాదవ్ మాట్లాడుతూ.. తనను పార్టీ కార్యవర్గ సభ్యుడిగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ కుమార్, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ సునీల్ బన్సన్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినందున పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

◆ **ఆర్థిక సాయం**

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని దౌలాపూర్‌కు చెందిన దివ్యాంగుడు ప్రభాకర్‌కు మైనంపల్లి సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ తరఫున మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సత్తాగౌడ్, సంగమేశ్వర్, ప్రవీణ్, కిష్టయ్య, శాదుల్లా, చోటుమియా, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రమాణ స్వీకారానికి కుల పెద్దలు హాజరు కావాలి**

తూప్రాన్: జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఆబోతు వెంకటేశ్‌యాదవ్ ప్రమాణ స్వీకారం ఈ నెల 15న గురువారం పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్‌యాదవ్ మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని యాదవ సంఘం నాయకులు, కుల పెద్దలు హాజరు కావాలని కోరారు.

◆ **సన్మానం**



చేగుంట(తూప్రాన్): మాసాయిపేట తహసీల్దార్ మాలతిని చెట్లతిమ్మాయిపల్లి సర్పంచ్ మోహన్‌రాథోడ్ పలువురు నాయకులతో కలిసి మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్ రాథోడ్, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు, పోచయ్య, సీతారాం, మనోహర్, సురేశ్ తదితరులు ఉన్నారు.

◆ **లింగాయత్‌లకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలి**

రేగోడ్(మెదక్): వీరశైవ లింగాయత్‌లకు కూడా రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బిజిలిపురం చిన్న వీరప్ప, నాయకులు సంగప్ప, మల్లికార్జున్, హన్మంతు, శంకరప్ప తదితరులు మంగళవారం కోరారు. లింగాయత్‌ల్లో కూడా పేదవారు ఉన్నారని, వారందరికీ ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలన్నారు.

◆ **వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ**



తూప్రాన్: మండలంలోని దాతర్‌పల్లిలో మంగళవారం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో హోమం, విగ్రహ హవనము, తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

◆ **‘విద్యా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి’**

టేక్మాల్(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ స్థానాల్లో విద్యా వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విద్యావలంటీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం పండరి కోరారు. మంగళవారం ఆయన టేక్మాల్‌లో మాట్లాడుతూ... కొన్నేళ్లు ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి కరోనా మహమ్మారితో దూరమైన విద్యా వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలో విద్యా వలంటీర్లను రెన్యువల్ చేసి విధుల్లోకి తీసుకోవాలన్నారు.

◆ **పెద్దచెరువు తూము పనుల పరిశీలన**



టేక్మాల్(మెదక్): అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సహకారంతో టేక్మాల్ జరుగుతున్న పెద్ద చెరువు తూము పునఃనిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ సుప్రజా భాస్కర్ పరిశీలించారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో గెస్ట్ టీచర్స్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టిగా పనిచేసేందుకు తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, జువాలజీ సబ్జెక్ట్‌లు బోధించేందుకు ఆసక్తి ఉన్నవారు నేరుగా ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఈ నెల 14న పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

◆ **మహిళా దినోత్సవానికి తరలిన నాయకులు**

చేగుంట(తూప్రాన్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకలో నిర్వహించిన మహిళా దినోత్సవాలకు ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, మహిళా ఉద్యోగులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. దుబ్బాకలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు మహిళా ప్రజాప్రతినిధులతో పాటు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది పలువురు మహిళ ఉద్యోగులు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు తరలిన వారిలో జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఎంపీటీసీలు వెంకటలక్ష్మి, బక్కి లక్ష్మారమేశ్, మహిళా సిబ్బంది ఉన్నారు.

చాకరిమెట్లలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్లలో కొలువైన సహకార ఆంజనేయస్వామిని మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతీ ఒక్కరు భక్తిభావంతో ఉండాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్: మండలంలోని కాజీపేట గ్రామానికి చెందిన పాంబండ మల్లేశ్ భార్య లావణ్యకు మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద రూ. 34వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, సూరారం నర్సింలు, నరేశ్, రమేశ్, నజీర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



చిలప్‌చెడ్(నర్సాపూర్): బీమా చెక్కును అందిస్తున్న రాజిరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అండగా నిలుస్తారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చిలప్‌చెడ్ మండలం బద్యా తండా వద్ద కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన చిట్కుల్ గ్రామంలో పోతారపల్లి లచ్చయ్య మృతి చెందడంతో కాంగ్రెస్ సభ్యత్వ బీమా చెక్కు రూ. 2 లక్షలు అతడి భార్య పోతారపల్లి లలితకు అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలం అని, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి, కిసాన్ సెల్ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రెడ్యానాయక్, చిట్కుల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బద్యా తండా అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు పీర్యానాయక్, ప్రశాంత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటూ, వారి తరఫున ప్రభుత్వంపై న్యాయపోరాటం చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గిరిజన తండా, కిష్టాపూర్, ఎనగండ్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరణించే వరకు కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని, పార్టీకి సేవ చేసిన కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించి, భరోసాను కల్పించారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్, కౌడిపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, చిన్నఘనాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం, దుర్గేశ్ తదితరులు ఉన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి



కేశమ్మ ఆలయానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దశంకరంపేట(మెదక్): పురాతన ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పేటలో శిథిలమైన దుర్గామాత ఆలయం, కేశమ్మ ఆలయాల పునర్నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఆలయాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దశరథ్, సీనియర్ నాయకులు విగ్రాం వేణుగోపాల్‌గౌడ్, ఆర్ఏస్.సంతోష్, పున్నయ్య, రాగం శ్రీను, రవీగౌడ్, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగాయపల్లిలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లిలో హనుమాన్ మందిర పునర్నిర్మాణానికి సర్పంచ్, గ్రామస్తులు భూమిపూజ చేశారు. మంగళవారం గ్రామ సర్పంచ్ నాగభూషణం, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డిల ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయానికి భూమిపూజ చేశారు. గ్రామస్తులు, దాతల సహకారంతో దేవాలయాన్ని నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు రాముశర్మ, మండల రైతు కో ఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



అల్లాదుర్గంలోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ

అల్లాదుర్గం(మెదక్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, నకిలీ విత్తనాల విక్రయాలు అరికట్టేందుకు ఫర్టిలైజర్ దుకాణాలపై దాడులు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం అల్లాదుర్గం దుకాణాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎవరైన నకిలీ విత్తనాలు తెస్తే వెంటనే 100 నంబర్‌కు, పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. రైతులను మోసం చేస్తే సహించే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజేశ్‌కుమార్, ఏఈఓ నవీన్ పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఉన్న ఎరువులు, విత్తన దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి యాదగిరి తనిఖీ చేశారు. ఈ సీజన్‌కు సరిపడా ఎరువులు, క్రిమిసంహారక మందులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన దుకాణాల యజమానులకు సూచించారు. ప్రతీ దుకాణంలో స్టాక్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని, అమ్మకాలు కొనసాగుతున్నా.. ఎరువులు, విత్తనాలకు సంబంధించి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు విధిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు.

పరామర్శ



చిన్నశంకరంపేట: బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మడూర్ మాజీ ఎంపీటీసీ చెన్నాయిపల్లి సిద్ధిరాములు తల్లి రెండు రోజుల క్రితం మృతి చెందగా మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, చెన్నాయిపల్లి సర్పంచ్ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌వాస్‌రెడ్డి ఉన్నారు. అలాగే కామారం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు జగ్గారి ఎల్లం తండ్రి మరణించగా ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. ఆమె వెంట కామారం సర్పంచ్ పూలపల్లి యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి ఉన్నారు.



నిజాంపేటలో ..

నిజాంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సోమవారం జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ పరామర్శించారు. ఈ మేరకు రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాస్టర్ క్రాంతి రాజ్, వోజ్జ రాజయ్య, ఇద్దరు ఇటీవల వేరువేరుగా రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ ఇరువురు కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల మాజీ అధ్యక్షుడు జాల పోచయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్, జీపీ స్వామి, రాజి రెడ్డి, సూర రాములు, లక్ష్మణ్, సొడ స్వామి తదితరులు పాల్గొన్నారు.